# మాజీ ప్రధాని మృతి పట్ల కడియం సంతాపం

ఉమడి వరంగల్, వాయిస్ టుడే: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉపముఖ్యమంత్రి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంతాపం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన గొప్ప వ్యక్తి భారత మాజీ ప్రధాని మన్మోసింగ్ అని అన్నారు. వారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో మన్మోహన్ సింగ్ అడుగుపెట్టారని, 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసారని వెల్లడించారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు భారత ప్రధానిగా ఆయన విశేష సేవలందించారన్నారు. దేశాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన ప్రధానుల్లో ఒకరిగా మన్మోహన్ సింగ్ నిలిచారని కడియం పేర్కొన్నారు. భారతదేశం అత్యంత విశిష్ట నాయకులలో ఒకరైన డాక్టర్ మన్మోహన్ సింగ్ ని కోల్పోవడం బాధాకరం అన్నారు. నిరాడంబరమైన మూలాల నుండి ఎదిగి, ఆర్థికవేత్తగా ఎదిగారని కొనియాడారు. ఆర్థిక మంత్రిగానే కాకుండా వివిధ ప్రభుత్వ పదవులలో పనిచేశారన్నారు. ప్రధానిగా ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఆయన విస్తృతంగా కృషి చేశారన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కడియం శ్రీహరి, కడియం కావ్య లు భగవంతుడిని ప్రార్థించారు.





## రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

వరంగల్: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సీఎం కప్–2024 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం జేఎన్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, హసన్‌పర్తి కిట్స్ కళాశాలలో బ్యాడ్మింటన్ పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికల జట్లు హాజరయ్యాయి. తొలిరోజు క్వాలిఫైయింగ్ మ్యాచులు ఉత్సాహంగా జరిగాయి. అంతకు ముందు మాజీ ప్రధాని దివంగత నేత మన్మోహన్‌సింగ్ మృతికి హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు, కోచ్‌లు, పీఈటీలు, పీడీలు, సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్‌సింగ్ మృతికి వారం రోజులపాటు సంతాప దినాలు పాటించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉండటంతో పోటీల ప్రారంభోత్సవానికి అధికారులు, ప్రజాప్రతినిధులు దూరంగా ఉన్నారు.




## పోలీసులు సివిల్ తగాదాల్లో తల దూర్చొద్దు

వరంగల్‌క్రైం: పోలీసు అధికారులు తప్పుడు కేసులు నమోదు చేయరాదని, సివిల్ పంచాయతీలో తల దూర్చొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. శుక్రవారం కమిషనరేట్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఠాణాల వారీగా నమోదైన కేసులు, వాటి పురోగతి, నిందితుల అరెస్టు, కేసు దర్యాప్తు తదితర అంశాలపై సమీక్షించారు. మహిళాలపై నేరాలు, ఆస్తి తగాదాలు, పోక్సో, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపాలన్నారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి, సాక్ష్యాలను సేకరించి కోర్టు ముందుంచాలన్నారు. సమావేశంలో డీసీపీలు రాజమహేంద్రనాయక్, రవీందర్, ఏఎస్పీ మనాన్ భట్, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## 'సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి'




జఫర్‌గఢ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక, నిరుద్యోగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో శుక్రవారం సీపీఎం జిల్లా మూడో మహాసభను పార్టీ మండల కార్యదర్శి మునిగాల రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. పేదలు, రైతులు, కూలీలకు కమ్యూనిస్టు పార్టీ అండగా నిలుస్తోందని తెలిపారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో జనగామ జిల్లాకు ఎంతో పేరు ప్రతిష్ఠ కలిగి ఉందని, ఇక్కడి నుంచే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. సాయుధ పోరాట స్ఫూర్తితో 10 వేల ఎకరాలను పేదలకు పంపిణీ చేసిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఏసీరెడ్డి, మంతేనా నారాయణరెడ్డి పోరాట ఫలితంగా పేదలకు మేలు జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పెట్టుబడిదారులకు అప్పగిస్తోందని విమర్శించారు. భాజపా ఎన్నికల సమయంలో ఏడాదికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయకుండా నిధుల కొరతను అడ్డు పెట్టుకొని పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కనకరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో అనేక ప్రజా పోరాటాలు సాగించామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జగిత్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీకాంత్, నేతలు రవి. రాపర్తి రాజు, యాదగిరి, అహల్య, సోమయ్య, రమేశ్, గోపి, యాకయ్య, ప్రకాశ్, చంద్రనాయక్, విజేందర్ పాల్గొన్నారు.

### ఎరుపెక్కిన స్టేషన్‌ఘన్‌పూర్..

సీపీఎం జిల్లా మూడో మహాసభ శుక్ర, శనివారంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి రైల్వే గేట్ వరకు ఎర్ర జెండాల తోరణాలను అందంగా తీర్చిదిద్దడంతో ఎరుపెక్కింది. నాలుగు దశబ్దాల తరువాత స్టేషన్‌ఘన్‌పూర్‌లో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహించడంతో కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే!

మహబూబాబాద్: గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా సర్వే చేపట్టింది. ఆ జాబితాలో తమ పేర్లు రాలేదంటూ పలువురు దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఏడాది ప్రజాపాలన ద్వారా తీసుకున్న దరఖాస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలంటూ కోరినవారి పేర్లతో జాబితా రూపొందించారు. అందులో పేరు వచ్చిన వారి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. తొలి ప్రాధాన్యంలో సొంత ఇంటి స్థలం ఉండి ఇల్లులేని వారిని గుర్తించారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఎలాంటి ఆధారంలేని వ్యక్తులను అర్హులుగా గుర్తించేందుకు చేపట్టిన ఈ సర్వే జరుగుతోంది. ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారంతో 113 మంది సూపర్‌వైజర్లు, 547 మంది సర్వే బృందం సిబ్బంది దరఖాస్తుదారుల గ్రామాల్లో పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి చిత్రాన్ని తీసుకోవడంతో పాటు వేరే ప్రాంతంలో ఖాళీ స్థలం ఉంటే దానిని కూడా దరఖాస్తుదారుతో కలిపి ఫొటో తీస్తున్నారు. ఇంటి స్థలాలకు సంబంధించిన దస్తావేజులను అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలోని 461 గ్రామ పంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాల్లోని 82 వార్డుల్లో ప్రజాపాలన ద్వారా వచ్చిన 2,17,591 దరఖాస్తుల్లో ఆదివారం నాటికి 1,13,863 దరఖాస్తులను పరిశీలించారు. పంచాయతీల్లో వచ్చిన 1,89,065 దరఖాస్తులకు 90,885 పరిశీలించారు. పురపాలక సంఘాల్లో 28,526 రాగా 22,978 పరిశీలించారు.

# వారిద్దరి మధ్య ఆత్మహత్యపై చర్చ!

**ఎస్సైతోనూ సంభాషణలు**

**నీళ్లలో మునగడంతోనే ఆ ముగ్గురి మృతి**

**ఒంటిపై గాయాల్లేవని తేల్చిన పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక**

**25న మధ్యాహ్నం 1.26 గంటలకే వారి ఫోన్లు స్విచ్‌ఆఫ్**

కామారెడ్డి, కామారెడ్డి నేరవిభాగం: కామారెడ్డి జిల్లా భిక్కనూరు ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట యువకుడు నిఖిల్... అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో మునగడంతోనే చనిపోయినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలు తెలిపాయి. నీటిలో ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పోలీసుల ద్వారా తెలిసింది. ముగ్గురి శరీరాలపై ఎటువంటి గాయాలు లేవని నివేదికల్లో వెల్లడైనట్లు సమాచారం. అయితే, ముగ్గురూ కలిసే చనిపోయారా? లేదంటే ఒకరు ఆత్మహత్యకు ప్రయత్నిస్తే కాపాడేందుకు యత్నించి మిగిలిన ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారా... అనే విషయంపై విచారణ ప్రారంభించారు. ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షులు, కీలక ఆధారాలు







లేకపోవడంతో సాంకేతికత సాయంతో పోలీసులు ముందుకు కదులుతున్నారు. భిక్కనూరు ఠాణా నుంచి అడ్లూర్‌ఎల్లారెడ్డి చెరువు వరకు దారి పొడవున ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించారు. ముగ్గురి సెల్‌ఫోన్లు 25న(బుధవారం) మధ్యాహ్నం 1.26 గంటలకు స్విచ్‌ఆఫ్ అయినట్లు నిర్ధారించారు. ముగ్గురూ అదే సమయంలో నీటిలో మునిగి చనిపోయి ఉంటారని భావిస్తున్నారు.

**కీలకంగా శ్రుతి, నిఖిల్‌ల చాటింగ్**

ఈ కేసులో ఘటనాస్థలంలో దొరికిన సెల్‌ఫోన్లే కీలకంగా మారాయి. ముగ్గురి కాల్‌డేటా, వాట్సప్ చాటింగ్‌ను పరిశీలిస్తున్నారు. శ్రుతి, నిఖిల్‌ల మధ్య ఆత్మహత్యపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. "నేను ఆత్మహత్య చేసుకుంటానంటే... నేను చేసుకుంటానని... కాదు కాదు ఇద్దరం కలిసే చేసుకుందాం" అంటూ ఇరువురి మధ్య బలవన్మరణంపై చాటింగ్ ఉన్నట్లు సమాచారం. వీరిద్దరు ఎస్సైతో సైతం పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఎస్సైకి చెందిన మూడు సెల్‌ఫోన్లలో రెండు అన్‌లాక్ కాలేదని, అన్‌లాక్ అయిన ఫోన్‌లోని వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు శుక్రవారం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేపట్టారు. అయితే సాక్షులు, ఆధారాలు లేకపోవడంతో ఏమీ తేల్చలేకపోయారు. శనివారం మరోసారి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయాలని నిర్ణయించారు.

**లాకర్‌లను తెరిచేందుకు ఉన్నతాధికారులకు లేఖ**

ఈ కేసులో ఆర్థికపరమైన అంశాలు ఏమైనా ముడిపడి ఉన్నాయా అనే కోణంలోనూ ముగ్గురి బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించాలని పోలీసులు నిర్ణయించారు. లాకర్‌లను తెరిచి దస్త్రాలను పరిశీలించేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోసం లేఖ రాశారు. 2018 బ్యాచ్ పోలీసుల నుంచి ఎస్సై సాయికుమార్ నడవడికపై వివరాలు సేకరిస్తున్నారు. ఆయన భార్య మహాలక్ష్మి, తల్లిదండ్రుల వాంగ్మూలాలను సేకరించడానికి మెదక్ జిల్లా కొల్చారానికి ప్రత్యేక బృందాన్ని పంపనున్నారు. శ్రుతి, నిఖిల్‌ల తల్లిదండ్రులు, బంధువులతోనూ మాట్లాడనున్నారు.



## గిరిప్రదక్షిణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లో గిరిప్రదక్షిణ అంగరంగ వైభోపేతంగా కోలాహలంగా భక్తులు లక్ష్మీ నరసింహుడి నామస్మరణలతో గిరిప్రదక్షిణ కొనసాగింది. గురువారం ఉదయం గిరిప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సామూహిక గిరిప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మాణం చేసిన యధారుషి,ప్రహ్లాద మండలపాలను ప్రారంభించారు. అనంతరం భక్తుల తో కలసి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు, ఆలయ అధికారులు స్వామి లడ్డుప్రసాదం అందజేశారు.



## మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

**రాష్ట్ర ఏర్పాటు మన్మోహన్ సింగ్ సారథ్యంలోనే: ఎమ్మెల్యే నాగరాజు**

ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. దేశ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన మహా ఆర్థిక మేధావి మన్మోహన్ సింగ్ అని.. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రపంచంలోనే ఆర్థిక శక్తిగా నిలబెట్టిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఎటువంటి వివాదాలు లేకుండా 10 సంవత్సరాలు ప్రధానిగా పనిచేసి వివాహ రహితుడగా పేరు పొందారని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా సోనియా గాంధీ మరియు మన్మోహన్ సింగ్ సారథ్యంలోనే సాధ్యం కావడం జరిగిందనీ, కేంద్ర మంత్రిగా ఆయన చేసిన సేవలు దేశం ఎన్నటికీ మార్చిపోదని, సోనియా గాంధీకి ప్రధానిగా అవకాశం వచ్చినప్పటికి మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా తీసుకు వచ్చిన ఆర్థిక సంస్కరణల దృష్ట్యా ప్రధాని పదవిని వారికి ఇవ్వడం జరిగిందన్నారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల డివిజన్ స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




## వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన మన్మోహన్ సింగ్

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంను రూపకర్త**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించి పదేళ్లపాటు ప్రధానమంత్రిగా దేశంలో అనేక వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. భారత దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అనారోగ్యంతో మృతి చెందగా అయన మృతికి సంతాపంగా శుక్రవారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి లు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో అద్భుతమైన పథకాలను ప్రవేశపెట్టిన ఘనత మన్మోహన్ సింగ్ కే దక్కిందన్నారు. 2005లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని ఆమోదించిందన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (%చీ=జు+ూ%) ను రూపొందించి %వీ+చీ=జు+ూ%గా పేరు మార్చబడిందని తెలిపారు. ఇది గ్రామీణ కుటుంబాలకు 100 రోజుల వేతన ఉపాధి హామీనిచ్చిన డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పూడ్చలేనిదని అన్నారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమలో మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు నాగరాజు, బుద్ధా జగన్, నాయకులు కూర వెంకట్, నాయిని లక్ష్మా రెడ్డి, మొహమ్మద్ అంకుస్, చక్రాల రఘు, డాక్టర్ పులి అనిల్, కుమార్ యాదవ్, కట్టా రఘుపాల్ రెడ్డి, మొహమ్మద్ జాఫర్, గుంటి స్వప్న, మొహమ్మద్ అజ్గర్, పాలడుగుల ఆంజనేయులు, మనోహర్, బి. శ్రీధర్ యాదవ్, క్రాంతి భరత్, షేక్ అహ్మద్, దండ్రే రమేష్, ఏదులాపురం లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.